వాన.. వరద

- పైతట్టు ప్రాంతాల్లో భారీ వర్షం
- రాజుపాళెం మండలంలోకి వరదనీరు
- జలదిగ్బంధంలో కొన్ని గ్రామాలు

రాజుపాళెం : పైతట్టు ప్రాంతాల్లో శనివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి రాజుపాళెం మండలంలోని కొన్ని గ్రామాలు జలదిగ్బంధంలో ఉండిపోయాయి. గ్రామాల చుట్టూ వరద నీరు బీభత్సం సృష్టించింది. పర్లపాడు, అర్కటవేముల గ్రామాల్లోని పలు కాలనీలు నాలుగు అడుగుల మేర వరద నీటి ప్రవాహంలో చిక్కుకున్నాయి. ఒక్క సారిగా మడువంక ప్రవాహం పెరగడం, గ్రామాల్లోకి వరద నీరు రావడంతో ఇళ్లలోని నిత్యావసర వస్తువులు తడిచిపోయాయి. ఇళ్ల వద్ద ఉన్న గొర్రెలు, మేకలు, పశువులు వరద నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పర్లపాడు గ్రామం నుంచి కొత్తపల్లెకు వెళ్లే రహదారిలో అర్కటవేముల, పొట్టిపాడు రోడ్లలోని ఎస్సీ కాలనీల్లో, అంకాలమ్మ దేవాలయం వద్ద వరద నీటితో మునకకు గురయ్యాయి. రాజుపాళెం తహసీల్దార్ మనోహర్‌రెడ్డి తమ సిబ్బందితో తెల్లవారుజాము నుంచే పర్లపాడులో పర్యటించారు. నాలుగు అడుగుల మేర నీటిలో నడుచుకుంటూ.. ఇళ్లలోకి నీరు చేరిన బాధితులతో ఆయన మాట్లాడారు. ఏమేరకు నష్టం జరిగిందో త్వరగా అంచనా వేసి ఆర్థిక సహాయం అందేలా చూస్తామన్నారు. జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ, తహసీల్దార్ మనోహర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మహేశ్వరరెడ్డి పర్లపాడు గ్రామంలో పర్యటించారు. మడువంక ద్వారా వచ్చిన వరద నీటి వల్ల నష్టపోయిన వారందరికీ జిల్లా కలెక్టర్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా చూస్తామని వారు తెలిపారు.

నిలిచిపోయిన రాకపోకలు

పైతట్టు ప్రాంతాల్లోని పెద్దముడియం, జమ్మలమడుగు మండలాల్లో కురిసిన భారీ వర్షానికి వంకలు, వాగులు పొంగిపొర్లాయి. రాజుపాళెం – వెంగళాయపల్లె, రాజుపాళెం – అయ్యవారిపల్లె, తొండలదిన్నె – టంగుటూరు గ్రామాల మధ్యలో ఉన్న మడు వంక ఉధృతంగా ప్రవహించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్క సారిగా వరద నీరు రావడంతో ఆయా గ్రామాల పరిధిలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రాజుపాళెం గ్రామంలోని వెంగళాయపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న పెట్రోలు బంకు వద్దకు, రాజుపాళెంలోని బ్రాందీ షాపు వద్దకు వర్షం నీరు చేరింది. రాజుపాళెం నుంచి చాగలమర్రి, ఆళ్లగడ్డ, ఇటు జమ్మలమడుగు మండలాల్లోని గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు చాలా ఇబ్బందులు పడుతూ వెళ్లారు. ఈ వదర నీటికి మడువంక పరిధిలోని పత్తి, మినుము, కంది, వరి పంటలు నీట మునిగాయి.

రెవెన్యూ అధికారులకు ప్రశంసలు

రాజుపాళెం మండలంలోని పర్లపాడు గ్రామంలోని పలు కాలనీల్లోకి శనివారం తెల్లవారుజామున ఉన్నట్టుండి ఒక్కసారిగా వర్షం నీరు ఇళ్లలోకి చేరింది. ఈ సమాచారాన్ని తహసీల్దార్ మనోహరరెడ్డితోపాటు వీఆర్ఓలకు గ్రామస్తులు చేరవేశారు. అయితే ఆ గ్రామానికి చేరుకునేందుకు దాదాపు 30 కిలోమీటర్లు చుట్టూ తిరిగి ఎన్నో వ్యయప్రయాసల కోర్చి జలదిగ్బందంలో ఉన్న పర్లపాడు గ్రామానికి తహసీల్దార్‌తోపాటు ఆర్ఐ హుసేన్‌రెడ్డి, వీఆర్ఓలు, వీఆర్ఏలు తెల్లవారుజామున ఆరు గంటలకే చేరుకున్నారు. ఐదారు అడుగుల మేర ప్రవహిస్తున్న వర్షం నీటిలో తహసీల్దార్‌తోపాటు సిబ్బంది పర్యటించారు. ఏ మేరకు నష్టం జరిగింతో, ఏదైనా ప్రాణ నష్టం జరిగిందా అని స్వయంగా నీటిలో తిరిగి అంచనా వేశారు. దీంతో ఆయా గ్రామస్తులు తహసీల్దార్, రెవెన్యూ అధికారులకు ప్రశంసలు కురిపించారు.


రాజుపాళెంలో హాస్టల్ చుట్టూ చేరిన వర్షం నీరు


రాజుపాళెం : వర్షం నీటిలో పత్తి పంట


రాజుపాళెం: పర్లపాడు గ్రామ సమీపంలో రహదారిపై ప్రవహిస్తున్న వర్షం నీరు


రాజుపాళెం: పర్లపాడు గ్రామంలో వరద నీటిలో పర్యటిస్తున్న తహసీల్దార్ మనోహర్‌రెడ్డి

రోడ్లు చెరువులైన వేళ

ప్రొద్దుటూరు రూరల్ : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎక్కడ చూసినా నీళ్లే. పంట పొలాలు, రోడ్లు అన్నీ చెరువులను తలపించేలా వర్షం నీటితో నిండాయి. శనివారం సాయంత్రం మడూరు రోడ్డులో వర్షం నీరు ఇటు నుంచి అటువైపు ప్రవహిస్తుండగా అక్కడే టూ వీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్ వాహనదారులు తమ వాహనాలను వర్షం నీటితో శుభ్రం చేసుకోవడం కనిపించింది.

క్లుప్తంగా

22 నుంచి దసరా ఉత్సవాలు

మైదుకూరు : పట్టణంలో శ్రీలక్ష్మీ మాధవరాయ, ఆంజనేయ, భీమేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బెల్లం సుబ్బరాయుడు తెలిపారు. శనివారం సాయంత్రం ఆలయంలో ఆయన ధర్మకర్తలతో కలిసి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. అలాగే అన్నలూరు వద్ద ఉన్న గణపతి నగరంలో వెలసిన శ్రీకాళికాదేవి సహిత శ్రీఅభిరామి సమేత అమృతేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఎంపీకి ఆహ్వానం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని అమ్మవారిశాల వీధిలో గల శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగే దసరా ఉత్సవాల్లో పాల్గొనాలని కడప ఎంపీ వైఎస్‌అవినాష్‌రెడ్డిని బద్వేలు ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కొండపల్లిచిన్న సుబ్బారావు ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం కడపలో వైఎస్‌అవినాష్‌రెడ్డిని బద్వేలు ఆర్యవైశ్య వర్తక సంఘం ప్రతినిధులు కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య వర్తక సంఘం నాయకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి పోకూడదు

ప్రొద్దుటూరు కల్చరల్ : యువత మాదక ద్రవ్యాల జోలికి పోకూడదని ఓంశాంతి భవన్ నిర్వాహకురాలు బీకే శాంత తెలిపారు. స్థానిక శ్రీవిద్య జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలను అలవాటు చేసుకోవడం వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాజయోగ ట్రైనర్ బీకే సౌజన్య, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, డైరెక్టర్ రాం మోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలి

చాపాడు : విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన ఉండాలని విద్యాశాఖ రాష్ట్ర చీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్ మహబూబ్‌బాషా పేర్కొన్నారు. శనివారం నక్కలదిన్నె ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు అన్ని రకాల వసతులు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్నాయన్నారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం క్రమం తప్పకుండా అందించాలన్నారు. గతంలో ఈ పాఠశాలలో తన తండ్రి ఉపాధ్యాయుడిగా బోధించాడన్నారు. తాను కూడా ఇక్కడే విద్యాభ్యాసం చేశానని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు, ఉపాధ్యాయులు, రూరల్ సీఐ శంకర్, ఎస్ఐ చిన్న పెద్దయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయానికి సహకారం

రాజుపాళెం : గ్రంథాలయానికి సహాయ, సహకారాలు అందిస్తామని అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఆ శాఖ ఉత్తర్వుల మేకకు రాజుపాళెంలోని గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సమావేశం గ్రంథాలయ అధికారి ఎస్.ప్రతాపుడు అధ్యక్షతన నిర్వహించారు. అధ్యక్షులుగా ఎంఈఓలు ప్రసాద్, రామస్వామిరెడ్డి, హెచ్ఎం హరిప్రియ, ఉపాధ్యాయుడు విజయమోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామచంద్రుడు, రామచంద్రారెడ్డి, నారాయణరెడ్డి, కుల్లాయప్ప, రత్నమ్మ, ఉసేనయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న పవన్‌కుమార్ వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులు, ఇతర విభాగాల సిబ్బంది పవన్‌కుమార్ కుటుంబానికి అండగా నిలిచారు. వీరంతా శనివారం పవన్‌కుమార్ ఇంటికి వెళ్లి ఆయన భార్య జ్యోతికి రూ. 40 వేల ఆర్థిక సాయం అందచేశారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రొద్దుటూరు రూరల్ : భారీ వర్షాల దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో వీఆర్‌ఓలు, వీఆర్ఏలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గంగయ్య తెలిపారు. శనివారం ఆయన మండలంలోని కొత్తపేట, పెన్నానగర్‌లో పర్యటించారు. వర్షాలు, వరదల వల్ల ఏవైనా ఇబ్బందులు ఉంటే వీఆర్ఏలు తమకు తెలియజేయాలని ఆయన తెలిపారు. వర్షాల వల్ల ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రామేశ్వరం నుంచి ఆర్టీపీపీకి వెళ్లే రహదారి పెన్నానదిలో కోతకు గురికావడాన్ని ఆయన పరిశీలించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ నగమోహన్‌రెడ్డి, వీఆర్ఓ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కలసపాడు : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కలసపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలసపాడు పీహెచ్‌సీలో వైద్యాధికారుల ఆధ్వర్యంలో చెట్లు నాటి సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రం చేసి ప్లాస్టిక్ కవర్లు, పేపర్లు, ప్లాస్టిక్ బాటిళ్ళు లేకుండా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ హరితాంధ్రప్రదేశ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బలహీన వర్గాలపై వివక్ష చూపడం దారుణం

బద్వేలు అర్బన్ : నియోజకవర్గంలో గత కొన్ని నెలలుగా బలహీన వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పట్ల రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు వివక్షపూరితంగా వ్యవహరించడం దారుణమని ప్రజాసంఘాల ఐక్యవేదిక నిజనిర్ధారణ కమిటీ నాయకులు జె.వి.రమణ, కారుఆంజనేయులు, అవ్వారుమల్లికార్జున, సంగటిమనోహర్, బందెలఓబయ్య పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆర్డీఓ చంద్రమోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలోని రజక కులానికి చెందిన మహిళ స్థలం సమస్య విషయంలో గోపవరం రెవెన్యూ అధికారులు మహిళను బెదిరించి భయభ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు. ప్రభుత్వ స్థలాలు, లేఅవుట్లలోని రహదారులు, శ్మశాన స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, వాటన్నింటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరు నెలలలోపు సమస్యలను పరిష్కరించకపోతే చలో బద్వేలు కార్యక్రమానికి పిలుపునిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దళితమిత్ర సంఘం అధ్యక్షుడు కె.రామాంజనేయులు, లోక్‌సత్తా ఉద్యమనేత దేవరశ్రీకృష్ణ, బీసీ మహాసభ జిల్లా నాయకులు పెంచలయ్య, యువ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల ఐక్యవేదిక నిజనిర్ధారణ కమిటీ నాయకులు

మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలి

ఆర్డీఓ ఎ.చంద్రమోహన్

బద్వేలు అర్బన్ : ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలని ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మైదుకూరు రోడ్డులోని చెన్నంపల్లె వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడంతో పాటు విద్యార్థులు, వివిధ శాఖల అధికారులతో పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బద్వేలు, గోపవరం తహసీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసంహారెడ్డి, అర్బన్ సీఐ లింగప్ప, ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ నయీమ్‌అలీ, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చెన్నంపల్లె వద్ద మొక్క నాటుతున్న ఆర్డీఓ, వివిధ శాఖల అధికారులు

మైదుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపల్లె తిరుమలనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం మున్సిపాలిటీ అధికారులు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ శ్రీనివాసులరెడ్డి, అధికారులు, సిబ్బంది ఈ సందర్భంగా మొక్కలను నాటారు.

దివ్యాంగుల కాలనీలు ఏర్పాటు చేయాలి

బద్వేలు అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అర్హులైన దివ్యాంగులందరికి ఇళ్ళ స్థలాలతో పాటు ఇళ్ళు నిర్మించి దివ్యాంగుల కాలనీలు ఏర్పాటు చేయాలని దివ్యాంగుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ఓబులేసు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయం జెవీభవన్‌లో నిర్వహించిన దివ్యాంగుల పోరాట సమితి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొంత ఇళ్ళు లేని దివ్యాంగులందరికి ప్రభుత్వం వెంటనే ఇళ్ళు మంజూరు చేయాలని కోరారు. అలాగే అంక్షల పేరుతో పెన్షన్ల తొలగింపు చర్యలు మానుకోవాలని కోరారు. దివ్యాంగులందరికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని కోరారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, జిల్లా సమితి సభ్యులు రమణ, ఏఐటీయూసీ నాయకులు నాగేష్, దివ్యాంగుల పోరాట సమితి పట్టణ అధ్యక్షుడు బాలరాజు, మహిళా విభాగం కన్వీనర్ నాగమణి, నాయకులు రఫి, ఖాదర్‌బాష, మురళి, ప్రసన్నకుమార్, ప్రసాద్, దేవసహాయం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యం నిర్దేశించుకుని చదవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ భావన మాట్లాడుతూ మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. విద్య ఉన్నత స్థానాల్లో నిలవడానికి ఎంతో దోహపడుతుందని, విద్య ప్రాముఖ్యతను వివరించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడా పోటీల్లో, చదవులో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ, కళాశాల డైరెక్టర్లు నాగూరు, రవీంద్రారెడ్డి, కోడైరెక్టర్ శైలూష, ప్రిన్సిపాల్ రామసుబ్బమ్మ, డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినికి బహుమతి అందిస్తున్న డీఎస్పీ భావన

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

మైదుకూరు : మైదుకూరులో శనివారం 6ఏ సైడ్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో మండలంలోని వనిపెంట జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఈ పోటీల్లో జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థినులు అపూర్వ, కుసుమ, 9వ తరగతి చదువుతున్న హిమబిందు, దివ్య, స్నేహ, అమీరూన్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు. ఎంపికై న విద్యార్థినులను, వ్యాయామ ఉపాధ్యాయిని శైలజను ప్రిన్సిపాల్ నిర్మల, వైస్ ప్రిన్సిపాల్ నసీమున్నీసా అభినందించారు.

చాపాడు : మండలంలోని చిన్నగురువలూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 20 మంది విద్యార్థులు ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం నాగరాజు తెలిపారు. జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో స్విమ్మింగ్, సైక్లింగ్, ఫెన్సింగ్, షూటింగ్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, టెన్నిస్ వంటి క్రీడల్లో అండర్–14, 17 విభాగాల్లో జగదీష్‌నాయక్, భద్ర, నవ్యశ్రీ, వీరమల్లేశ్వరి, మైమూన్, వసంత్‌కుమార్, రామచంద్ర, గంగులయ్య, ఈశ్వర్, కిరణ్, మహబూబ్‌బీ, సుదర్శన్, వైశాలి, నందిని, అమృత, లేఖన, కీర్తన, సునంద, జీవన్ కుమార్, వీరశంకరమ్మ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు ఫిజికల్ డైరెక్టర్ వినోనియా రాణి తెలిపారు.

పోరుమామిళ్ల : రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు పోరుమామిళ్ల యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు ఎంపికయినట్లు పీఈటీ కరీముల్లా తెలిపారు. మైదుకూరులో జరిగిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ (6ఎ సైడ్ అసోసియేషన్) పోటీల్లో పోరుమామిళ్ల నుండి 15 మంది పాల్గొనగా అందులో 11 మంది హరిప్రియ, శరణ్య, లక్కీ, అపూర్వ, మల్లికార్జున, పవన్, గురుప్రసాద్, పెద్ద పీరయ్య, రసూల్‌బాష, వసీమ్, ఆంజనేయులు ఎంపికయ్యారన్నారు. వీరంతా అక్టోబర్ 5 న కావలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నిర్మల

'ఆరోపణల్లో వాస్తవం ఉంది'

ప్రొద్దుటూరు : బ్లాక్‌మెయిల్ బ్యాచ్‌పై చేసిన ఆరోపణల్లో వాస్తవం ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్‌మాదిగ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ సినీ హబ్ రాజేశ్వరరెడ్డిపై పట్నం నరసింహులుకు డబ్బు బాకీ ఉన్నాడని గతంలో కేసు పెట్టించారన్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఇప్పటికైనా ఇలాంటి వారిపై దృష్టి సారించి అవినీతిని అరికట్టాలని కోరారు. పట్టణంలో ప్రముఖులను, వ్యాపారులను విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి మిమ్మల్ని గెలిపించారన్నారు. కౌన్సిలర్ బస్సు మురళీ లాంటి వాళ్లను దగ్గర పెట్టుకుంటే ప్రమాదమేనని తెలిపారు. తనపై కూడా తన సామాజిక వర్గం వారి చేత తప్పుడు కేసు పెట్టించాలని ప్రయత్నించారని, సీఐ, డీఎస్పీలు అంగీకరించలేదన్నారు. సమావేశంలో సుబ్బరాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

పోరుమామిళ్ల: పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని, ప్రతి ఒక్కరూ తమ వంతు కృషిగా చెట్లు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పుల్లివీడు సర్పంచు రఘునాథరెడ్డి పిలుపిచ్చారు. శనివారం పుల్లివీడు సచివాలయం వద్ద ఆయన మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి


పర్లపాడులో వర్షం నీటిలో దిగి నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు

రాజుపాళెం : మండలంలోని పర్లపాడు గ్రామంలో శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి ఇళ్లలోకి వర్షం నీరు చేరిందని, ఆ వరద బాధితులందరిని ప్రభుత్వం ఆదుకోవాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్ డిమాండ్ చేశారు. ఆయనతోపాటు పలువురు ఆ గ్రామ ఎస్సీ కాలనీ ప్రజలు నాలుగైదు అడుగుల లోతులో ఉన్న వర్షం నీటిలో దిగి నిరసన తెలియజేశారు. అనంతరం జగన్ మాట్లాడుతూ అర్ధరాత్రి గ్రామస్తులు నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా భారీగా నీళ్లు వచ్చి ఇళ్లలోకి పోయాయన్నారు. అందులో గడ్డివాములు నీట మునగడం, మేకలు, పశువులు, కోళ్లు చనిపోవడం, కొట్టుకుపోవడం జరిగిందన్నారు. అలాగే ఇళ్లలో ఉన్న వస్తువులు, సామగ్రి నీటమునిగాయన్నారు. వర్షం నీటితో నష్టపోయిన ప్రతిఒక్కరిని ప్రభుత్వంతోపాటు అధికారులు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వంశీ, బ్రహ్మం, చిన్న సుబ్బయ్య, చెన్నకేశవ, సుధాకర్, ఓబన్న పాల్గొన్నారు.

ఎంపీజే నూతన కమిటీ ఏర్పాటు

మైదుకూరు : మైదుకూరులో శనివారం జరిగిన సమావేశంలో మూమ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్(ఎంపీజే) నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ పట్టణ, మండల అధ్యక్షుడిగా మహమ్మద్‌గౌస్, కార్యదర్శిగా మున్నా, కోశాధికారిగా అన్వర్ బాషా, పలువురు ఉపాధ్యక్షులుగా, సహాయ కార్యదర్శులుగా ఎన్నియ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, రాయలసీమ ఇన్‌చార్జి అయూబ్ ఖాన్, గౌరవాధ్యక్షుడు యాకూబ్ హుస్సేన్ తదతరులు పాల్గొన్నారు.

బి.మఠం పరిపాలనా అధికారిగా చంద్రశేఖర్ ఆజాద్

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం వీరబ్రహ్మేంద్రస్వామి మఠంకు పరిపాలనా అధికారిగా తిరుపతి ప్రాంతీయ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్‌ఆజాద్‌ను ఎండోమెంట్ శాఖ నియమించింది. అలాగే ధార్మిక పరిషత్ త్వరలో మఠాధిపతి నియామకంకు పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

ముగిసిన ధార్మిక సందేశాలు

బ్రహ్మంగారిమఠం : నరసన్నపల్లెలో శనివారం టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధార్మిక సందేశాలు ముగిశాయి. ధార్మిక ఉపన్యాసకులు చాపాటి సుబ్బారెడ్డి సందేశాలు ఇచ్చారు. 16 నుంచి జరిగుతున్న ధార్మిక ఉపన్యాసాలు గ్రామంలో భక్తులను ఆకట్టుకుంది.

ప్రణాళికతో ముందుకు సాగితే విజయం తథ్యం

బద్వేలు అర్బన్ : యువత ప్రణాళికతో ముందుకు సాగితే విజయం తప్పక సొంతమవుతుందని హైదరాబాద్ రక్షణ ఐఏఎస్ అకాడమి డైరెక్టర్ డాక్టర్ ఎం.మమత అన్నారు. స్థానిక రాచపూడినాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులతో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే క్రమంలో ఓపికతో సిద్ధం కావాలని, కేవలం ఒకసారి ప్రయత్నించి విఫలం చెందితే అంతటితో ఆ ప్రయత్నాన్ని ఆపేయకూడదని కోరారు. విజయం సాధించిన ప్రతిఒక్కరిని స్ఫూర్తిగా తీసుకుని అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని కోరారు. సివిల్స్, గ్రూప్స్‌కు సిద్ధమయ్యే విద్యార్థులు 6వ తరగతి నుండే ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యాంశ పుస్తకాలను అనుసరించాలని కోరారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ కె.నరసింహారెడ్డి మాట్లాడుతూ కొద్దిపాటి వైఫల్యానికే యువత జీవితం మీద ఆశలు కోల్పోయి బలవన్మరణానికి పాల్పడుతున్నారని, అలా కాకుండా ఓపిక, ఆశాభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సదస్సులో సాక్షి దిన పత్రిక ఎడ్యుకేషన్ డెస్క్ ఇన్‌చార్జి కె.సురేష్, రాచపూడి నాగభూషణం విద్యాసంస్థల పరిపాలనాధికారి ఆర్.వి.సాయిక్రిష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలఓబులేసు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న రక్షణ ఐఏఎస్ అకాడమి డైరెక్టర్ డాక్టర్ మమత

కరాటే శిక్షణతో బాలికలకు ఆత్మరక్షణ

ప్రొద్దుటూరు క్రైం : బాలికలకు కరాటే శిక్షణ.. ఆపద సమయంలో ఆత్మరక్షణగా పనికి వస్తుందని ప్రొద్దుటూరు డీఎస్పీ పి.భావన తెలిపారు. ప్రొద్దుటూరు సబ్‌డివిజన్‌లోని శక్తి టీం ఆధ్వర్యంలో వైవీఎస్ మున్సిపల్ బాలికల పాఠశాలలో శనివారం నిర్వహించిన ఆత్మరక్షణ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమకు తాము ధైర్యంగా ఉంటూనే అగంతకుల బారి నుంచి సురక్షితంగా తప్పించుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. సురక్షితంగా తప్పించుకునేందుకు ఓర్పు, నేర్పుతోపాటు ఆత్మస్థైర్యం అవసరమన్నారు. ఇవన్నీ ఇక్కడి విద్యార్థినుల్లో ఉందని గుర్తించి, సబ్‌డివిజన్ పరిధిలో మొదట ఈ పాఠశాల నుంచే ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. శిక్షణా తరగతుల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొని క్రమశిక్షణతో కరాటే నేర్చుకున్న విద్యార్థినులను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్, శక్తిటీం ఇన్‌చార్జి ఎస్ఐ కేపీటీ వెంకటరెడ్డి, శక్తిటీం సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినులను అభినందిస్తున్న డీఎస్పీ భావన

తప్పులు లేని ఓటర్ల జాబితాయే లక్ష్యం

బద్వేలు అర్బన్ : తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యంగా బూత్ లెవల్ అధికారులు కృషి చేయాలని ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలోని సభా భవనంలో నియోజకవర్గంలోని బీఎల్ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2002 సంవత్సరంలోని ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్లు 2025 ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదై ఉన్నారో లేదో పరిశీలించాలని కోరారు. 2002 ఓటర్ల జాబితాలో, 2025 ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదై ఉన్న వారి వివరాలను రెండు రోజుల్లోపు గుర్తించి ఆర్డీఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు. అలాగే బూత్‌స్థాయి అధికారులు అర్హత ఉన్న 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించడంతో పాటు ఏదైనా కారణాల చేత మృతిచెందిన వారి ఓట్లను జాబితా నుండి తొలగించాలని కోరారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో బద్వేలు, గోపవరం తహసీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఏది నిజమో నిగ్గు తేల్చండి'

ప్రొద్దుటూరు క్రైం : తనపై వచ్చిన ఆరోపణలపై నిగ్గు తేల్చాలని ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారుమునిరెడ్డికి శనివారం రాత్రి వన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ నెల 18న తనకు ఏకే రామాంజనేయులు పేరుతో ఒక లెటర్ వచ్చిందన్నారు. అందులో న్యాయవాది గౌర్రెశ్రీనివాసులు, గోసంగివెంకటసుబ్బారెడ్డి, 5వ వార్డు కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి, పల్లె రఘురామిరెడ్డిలు బ్లాక్ మెయిల్ దందాలు చేస్తున్నట్లు ఉందన్నారు. దీంతో ఈ లెటర్ విషయమై తాను గోసంగి వెంకటసుబ్బారెడ్డికి వివరించి వాట్సప్ ద్వారా పంపించానన్నారు. ఇదే లెటర్ పట్టణంలోని పలువురు రాజకీయ నాయకులకు వచ్చినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే తానే ఈ లెటర్లను ఉద్దేశ పూర్వకంగా రాసినట్లు గౌర్రెశ్రీనివాసులు, మురళీధర్‌రెడ్డి, గోసంగి వెంకటసుబ్బారెడ్డిలు ఆరోపించడమే గాక తనతోపాటు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. అంతేగాక తనపై వీరు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బంగారుమునిరెడ్డి తెలిపారు. ఈ లెటర్లకు సంబంధించి ఎవరు రాశారనేదానిపై ఏది నిజమో, ఏది అపద్దమో నిగ్గు తేల్చి కారకులైన వారిపై చర్యలు తీసుకోవలని బంగారుమునిరెడ్డి కోరారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ సీఏస్ ఖాజా మొహిద్దిన్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, 28వ వార్డు కౌన్సిలర్ పాతకోట ముని వంశీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఫరీద్, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి ఉన్నారు.


సీఐకి ఫిర్యాదు చేస్తున్న బంగారుమునిరెడ్డి

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కాశినాయన : ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రశాంతి తెలిపారు. శనివారం మండలంలోని కోడిగుడ్లపాడు గ్రామంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ బాలగురవయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు గురివిరెడ్డి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చలో గుంటూరును జయప్రదం చేయండి

మైదుకూరు : విద్యారంగ ఆర్థిక సమస్యలపైన యూటీఎఫ్ చేపట్టిన చలో గుంటూరు రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్ తెలిపారు. మండలంలోని వనిపెంట జెడ్పీ హైస్కూల్ ఆవరణలో శనివారం రణభేరి గోడ పత్రికలను ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు